క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన రాష్ట్ర కార్యదర్శులు



వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న వెంకటేశ్వరరావు, రమణారెడ్డి, ప్రసాద్, పక్కన మేరుగు నాగార్జున

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.వెంకటేశ్వరరావు, కె.వి.రమణారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి. ప్రసాద్ శనివారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో వైవీని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. వారి వెంట మాజీమంత్రి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ మేరుగు నాగార్జున ఉన్నారు.

ఇంగ్లిష్ బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు బాలికల గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్ బోధించేందుకు అర్హత ఉన్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.మాధవి తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్ చదివి అర్హత ఉన్న వారు అర్హులని తెలిపారు. నెలకు రూ.16100 జీతం అందించనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు 87126 25043 నంబరును సంప్రదించాలని సూచించారు.

ట్రాక్టర్ - ద్విచక్రవాహనం ఢీ

- వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన మార్తబాబు

నాగులుప్పలపాడు: ట్రాక్టర్ – ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం మండలంలోని చదలవాడలో జరిగింది. ఒంగోలుకు చెందిన పాతూరి మార్తబాబు ద్విచక్రవాహనంపై ఒంగోలు నుంచి నాగులుప్పలపాడు వెళ్తున్నాడు. ముందువెళ్తున్న ఇసుక ట్రాక్టర్ను చదలవాడ పెట్రోల్ బంకు వద్ద ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో ద్విచక్రవాహనం ఢీకొని దానిపై ప్రయాణిస్తున్న మార్తబాబు కిందపడి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఒంగోలు రిమ్స్కు అతన్ని తరలించారు.

హెచ్ఈసీ గ్రూపునకు ప్రాధాన్యత ఇవ్వాలి



సదస్సులో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ కళాశాలల్లో హెచ్ఈసీ గ్రూపునకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు జి.గోపిచంద్ ప్రకాష్ కోరారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్లో శనివారం ఏర్పాటు చేసిన హిస్టరీ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ మూడో రాష్ట్ర సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 200 మంది అధ్యాపకులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ వి.రామ్మోహన్రెడ్డి, ఉపాధ్యక్షుడు పాటిబండ్ల లాభన్ రాష్ట్ర ప్రధాన సలహాదారులు గంగాధర్ రావు, జాయింట్ సెక్రటరీ వాసుదేవరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే బుజ్జిబాబు, ఆఫీస్ సెక్రటరీ ఇందిరా, జోనల్ ఇన్చార్జులు, జిల్లా ఇన్చార్జిలు పాల్గొన్నారు.

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే..



తొ్రగుడిపాడులో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు



గాడిపర్తివారిపాలెంలో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు

- పేదలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే..
- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజం
- ఇలపావులూరు, గాడిపర్తివారిపాలెం, తొ్రగుడిపాడులో బాబు షూరిటీ–మోసం గ్యారంటీ సమావేశాలు

చీమకుర్తి రూరల్: చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని, సంక్షేమం రెట్టింపంటూ, సూపర్సిక్స్ పథకాలంటూ, భవిష్యత్తును మారుస్తానంటూ పేద ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి నమ్మించి మోసం చేశారని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. శనివారం చీమకుర్తి మండల పరిధిలోని ఇలపావులూరు, గాడిపర్తివారిపాలెం, తొ్రగుడిపాడు గ్రామాల్లో బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి పాలనలో రైతన్నలు ఆరుగాలం కష్టపడి చమటోడ్చి పండించిన వరి, పొగాకు, మిర్చి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. రైతన్నలకు గిట్టుబాటు ధరలు కల్పించారని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తే తప్ప రైతన్నల వైపు చూడలేదన్నారు. ఇలపావులూరు, గాడిపర్తివారిపాలెం, పల్లామల్లి, తొ్రగుడిపాడు గ్రామాల్లో పాడిపరిశ్రమలే జీవనాధారంగా ఉన్నాయన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాడి రైతులకు అమూల్ ద్వారా లీటరు గేదె పాలకు రూ.80, ఆవు పాలకు రూ.43 మద్దతు ధర కల్పించారని గుర్తుచేశారు. ప్రస్తుతం లీటరు గేదె పాలకు రూ.70, ఆవు పాలకు రూ.38కి తగ్గించి ఇస్తున్నారన్నారు. పాడి పరిశ్రమల రైతులను ఆదుకోవాలని, పాలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలిచే ప్రభుత్వమని, కూటమి ప్రభుత్వం పేద ప్రజలను దగా చేసే ప్రభుత్వమని విమర్శించారు. సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వ పాలకులు నడిపిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు యన్నం శేషురెడ్డి, నాయకులు చీదర్ల శేషు, పిన్నిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొడ్డు కోటేశ్వరరావు, కుంచాల రాంబాబు, యూత్ అధ్యక్షుడు వెంగారెడ్డి, పాలపర్తి అన్వేష్, సర్పంచ్లు యద్దనపూడి అంజమ్మ, శ్రీనివాసరావు, పులి రమణమ్మ, రత్తయ్య, అయ్యారయ్య, ఎస్.సుబ్బరామిరెడ్డి, నల్లూరి చంద్రమోహన్, బి.హరిబాబు, సుబ్బు, పులి హరిబాబు, కోటేశ్వరరావు, మాగులూరి ఇమ్మానేలు, కొనికి సుబ్రహ్మణ్యం, మంచా హరికృష్ణ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు వైఎస్సార్ సీపీ అండ



జీజీహెచ్లో సీతారావమ్మను పరామర్శిస్తున్న చుండూరి రవిబాబు

- పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు

ఒంగోలు టౌన్: గంజాయి బ్యాచ్ దాడి చేసిన ఘటనలో గాయపడిన కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామానికి చెందిన పూరిని సీతారావమ్మ, సుబ్బారెడ్డి దంపతులను వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు శనివారం పరామర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఒంగోలు జీజీహెచ్కి వెళ్లి సీతారావమ్మ, సుబ్బారెడ్డి దంపతులతో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలడిగి తెలుసుకున్నారు. తమ కుమారుడు నాగార్జున, కోడలు నందినితో కలిసి నివసిస్తుంటామని, పక్కన నివాసం వుంటున్న చెనిగె సాయిరెడ్డి తరచూ తమ కోడలు నందినిని లైంగికంగా వేధిస్తున్నాడని వారు తెలిపారు. ఈ విషయం తెలిసి మందలించడంతో కక్ష పెంచుకుని తమ మీద దాడికి పాల్పడ్డారని వాపోయారు. ఈ దాడిలో సీతారావమ్మ తలపగిలిందని, వెంటనే జీజీహెచ్కి తరలించి ప్రాణాలు కాపాడుకున్నామని కన్నీరు పెట్టుకున్నారు. సాయిరెడ్డి ఆ గ్రామంలో గంజాయి సేవిస్తూ తరచూ మహిళలు, బాలికలను వేధిస్తున్నాడని, పోలీసులు తగిన చర్యలు తీసుకోకపోతే గ్రామంలో మహిళలు స్వేచ్ఛగా జీవించలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ బాధితులకు పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. చుండూరి రవిబాబు వెంట పార్టీ కొత్తపట్నం మండలాధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, మోటుమల గ్రామ సర్పంచ్ గోపి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.





ఒంగోలు ఐశ్వర్యనగర్ కృష్ణ మందిరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు, దర్శించుకుంటున్న భక్తులు



రుక్మిణి, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

జయ కృష్ణా ముకుందా మురారి

- భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు
- శాస్త్రోక్తంగా రుక్మిణీ శ్రీకృష్ణ కళ్యాణం
- రాధా, రుక్మిణి, శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులు
- వైభవంగా ఉట్టి కొట్టు వేడుకలు
- భక్తులతో సందడిగా శ్రీకృష్ణ ఆలయాలు

ఒంగోలు మెట్రో: శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఒంగోలులోని మంగమూరుడొంకలో గల శ్రీ మురళీకృష్ణ మందిరంలో, గోశాల గోక్షేత్రం కృష్ణ మందిరంలో, మస్తాన్దర్గా వద్ద ఉన్న మురళీకృష్ణ మందిరంలో, నగరంలోని ఇష్ట మందిరాల్లో అర్చకులు స్వామివారి మూలవిరాట్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించి అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. సాయంత్రం గోశాలలో రుక్మిణీ శ్రీకృష్ణ పరిణయ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్థానిక భక్తులు మందిరం పరిధిలో ఉత్సాహంగా ఉట్టి కొట్టి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రుక్మిణి, సత్యభామ, గోపికల వేషధారణలో ఉత్సాహంగా పాల్గొని అలరించారు.

వైభవంగా వేల్ కావడి మహోత్సవం...

ఒంగోలు నగరంలో శనివారం సుబ్రహ్మణ్యస్వామికి భక్తిశ్రద్ధలతో వేల్ కావడి మహోత్సవం నిర్వహించారు. స్థానిక భక్తులు సుబ్రహ్మణ్యస్వామి మొక్కుగా





కళ్యాణ మహోత్సవంలో వధూవరులుగా రుక్మిణీ శ్రీకృష్ణుడు



నాగులుప్పలపాడు : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

త్రిశూలాలు గుచ్చుకుని అంగరంగ వైభవంగా నిర్వహించిన ఊరేగింపులో పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలలో మొక్కులు చెల్లించుకున్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉప్పుగుండూరులో శ్రీకృష్ణ దేవస్థానం వద్ద శ్రీకృష్ణ యాదవ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి అన్నదానం చేశారు. ఉదయం దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి విద్యుత్ కాంతులతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని పూజారి దీవి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకృష్ణ యాదవ్ కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ మాగులూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కొత్తపట్నం: మండలంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అన్ని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈతముక్కల గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో మందిర కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు జీజీహెచ్ సిబ్బంది సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 40 మంది వరకూ రక్తదానం చేశారు. అనంతరం శ్రీకృష్ణునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 1000 మందికి అన్నదానం చేశారు. కొత్తపట్నం ద్వారకానగర్లో, అల్లూరు బస్టాండ్ సెంటర్లో, రాజుపాలెంలో,



ఈతముక్కలలో కృష్ణుడి విగ్రహం వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న ప్రభాకర్, డాక్టర్లు

పాదర్తి గ్రామాల్లో శ్రీకృష్ణుడి విగ్రహాలకు పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభాకర్, రామకృష్ణ, కోటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో...

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే వేడుకలు నిర్వహించారు. చీమకుర్తి ఇసుకవాడ ప్రాంతంలోని శ్రీకృష్ణ మందిరంలో ఆలయ జీర్ణోద్ధరణ సందర్భంగా హోమాలు నిర్వహించారు.



నాగులుప్పలపాడు : ప్రత్యేక పూజలు అందుకుంటున్న స్వామివారు

సుబ్రహ్మణ్యస్వామి వేల్ కావడి నగరోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు





ఒంగోలు రాధాకృష్ణ మందిరంలో స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు



ఒంగోలు గోశాల గోక్షేత్రంలో రుక్మిణీ శ్రీకృష్ణ కళ్యాణంలో పాల్గొన్న దంపతులు

సమాజసేవలో శర్మ కళాశాల పూర్వ విద్యార్థులు

ఒంగోలు సిటీ: గుడ్ హార్ట్స్ పేరుతో శర్మ కళాశాల పూర్వ విద్యార్థులు సమాజ సేవకు పునరంకితం కావాలని పలువురు పూర్వ విద్యార్థులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మౌర్య హోటల్లో శర్మ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా సీతారాంపురంలో ఏర్పాటు చేసిన గురువు ఎన్ఎస్ ఈశ్వరప్రసాద్ విగ్రహానికి, భారతరత్న, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇటీవల మరణించిన పూర్వ విద్యార్థులైన ఆర్.మార్క్, యాదల సుబ్బారావుకు నివాళులర్పించారు. సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులందరూ వారి వారి అనుభవాలను పంచుకున్నారు. ఆత్మీయంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల వివిధ హోదాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన బెజ్జం సుబ్బారావు, నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వర్లు, కే వెంకటేశ్వర్లు, సౌజన్య కుమార్, సుకుమార్ బాబు, పోలయ్యలను సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక సేవకు అంకితం కావాలన్న ఉద్దేశంతో నిర్మాణాత్మకంగా పనిచేసేందుకు కమిటీని ఏర్పాటు చేశారు.



సమావేశంలో పాల్గొన్న శర్మ కళాశాల పూర్వ విద్యార్థులు

నూతన కమిటీ...

అధ్యక్షునిగా పల్నాడు డీఆర్ఓ ఏకా మురళి, ఉపాధ్యక్షునిగా కత్తి కళ్యాణ్, కార్యదర్శులుగా కొమ్మూరి రవిచంద్ర, దేవ సహాయం, కోశాధికారిగా యాతం శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా భక్తవత్సలం, వై.చెన్నయ్య, ఆడిట్ కమిటీ సభ్యులుగా వెంకటస్వామి, యు.ఆనంద్, గౌరవ సలహాదారులుగా దారా వెంకట్రావు, చెల్లి ప్రసాద్, పిడుగురాళ్ల సుబ్బారావు, ఎస్.రాజారావు, బెజ్జం సుబ్బారావు, సుధీర్ బాబు, లీగల్ అడ్వైజర్గా యాదవ కిషోర్బాబును ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులతో గోవాడ రమేష్బాబు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో దేవకపావరం, మట్టిగుంట మహేశ్వరరావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఆశీర్వాదం, పిచ్చయ్య, మురళి, శ్రీనివాసమూర్తి, జాన్సన్, లూథర్, డేవిడ్, తిరుమల, నాగేశ్వరరావు, జయశీలరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత వందేమాతరం గీతంతో ప్రారంభమైన సమావేశం.. జనగణమనతో ముగిసింది. ఈ సందర్భంగా సామాజిక కార్యక్రమాల నిమిత్తం పలువురు కొంత నిధిని సమకూర్చారు. శర్మ కాలేజీలో తమతో పాటు చదువుకుని ఆర్థిక ఇబ్బందులలో ఉన్నవారికి సహాయం చేయాలని, సామాజిక కార్యక్రమాలను సత్వరం చేపట్టాలని తీర్మానించారు. ఇందుకోసం భవిష్యత్తు నిధిని సమకూర్చుకోవాలని నిర్ణయించారు.